పాక్ దిగుమతులపై నిషేధం

ఆంక్షలు ఉధృతం చేసిన భారత్ ■ పార్సిళ్లు, మెయిల్సూ నిలిపివేత ■ ఆ దేశ నౌకల ప్రవేశానికి నిరాకరణ

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి దరిమిలా భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి వచ్చే అన్ని వస్తువుల దిగుమతులపై భారత్ నిషేధం విధించింది. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్(డీజీఎఫ్‌టీ) మే 2న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నిషేధం తక్షణమే అమలులోకి వస్తుంది. పాకిస్థాన్ నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎగుమతి అయ్యే అన్ని వస్తువులపై నిషేధం విధిస్తూ విదేశీ వాణిజ్య విధానం(ఎఫ్‌టీపీ)లో ఒక నిబంధన చేర్చినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. తదుపరి ఉత్తర్వుల వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని పేర్కొంది. జాతీయ భద్రత, ప్రభుత్వ విధానం ప్రయోజనాల కోసం పాకిస్థాన్ నుంచి లేదా పాకిస్థాన్ మీదుగా వచ్చే అన్ని వస్తువులపై దిగుమతి నిషేధం విధించినట్లు నోటిఫికేషన్ తెలిపింది. ఈ ఆంక్షలకు ఎటువంటి మినహాయింపులైనా భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరమని డీజీఎఫ్‌టీ స్పష్టం చేసింది. ఎఫ్‌టీపీలో పాకిస్థాన్ నుంచి దిగుమతులపై నిషేధం శీర్షికతో నిబంధనను చేర్చింది. ఏప్రిల్ 22న జరిగిన అత్యంత పాశవిక ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ అనేక దౌత్యపరమైన, ఆర్థికపరమైన కఠిన ఆంక్షలను ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ కూడా భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేసింది. భారత్, పాక్ మధ్య ఇటీవలి సంవత్సరాలలో ద్వైపాక్షిక వాణిజ్యం బాగా తగ్గిపోయింది.

పాక్‌కు చేసే ఎగుమతుల్లో గణనీయ తగ్గుదల

పాకిస్థాన్ నుంచి భారత్ ప్రధానంగా దిగుమతి చేసుకునే వస్తువులలో రాగి, రాగి పాత్రలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, పత్తి, ఉప్పు, సల్ఫర్, రంగురాళ్లు, సేంద్రియ రసాయనాలు, ఖనిజ ఇంధనాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉన్ని, గాజువస్తువులు, ముడి చర్మాలు, చర్మం మొదలైనవి ఉన్నాయి. పాకిస్థాన్‌కు భారత్ ఎగుమతులలో కూడా గణనీయమైన తగ్గుదల ఉంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య 44.77 కోట్ల డాలర్ల ఎగుమతులు ఉండగా అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో 110 కోట్ల డాలర్ల ఎగుమతులు ఉన్నట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. మరోవైపు పాక్ నుంచి గగనతల, ఉపరితల మార్గాల్లో వచ్చే అన్ని రకాల పార్సిళ్లు, మెయిళ్ల ఎక్స్ఛేంజిని భారత్ నిలిపివేసింది. పాక్‌కు ఎలక్ట్రానిక్స్, ఈ-కామర్స్ వస్తువుల ఎగుమతిపై ఆంక్షలు విధించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

పాక్ నౌకల ప్రవేశంపై నిషేధం

భారత నౌకాశ్రయాల్లోకి పాకిస్థాన్ నౌకలు ప్రవేశించడంపై శనివారం భారత ప్రభుత్వం నిషేధం విధించింది. అదే విధంగా పాకిస్థాన్ నౌకాశ్రయాల్లోకి భారతీయ నౌకలు వెళ్లడాన్ని కూడా నిషేధించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్, జల మార్గాల శాఖ తెలిపింది. భారత దేశ ఆస్తులు, సరుకు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలను పరిరక్షించుకునేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పింది. ఏదైనా నౌకకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఇవ్వడం గురించి సందర్భాన్ని బట్టి పరిశీలించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

యుద్ధానికి సిద్ధం!

తమ వ్యవస్థలు, సిబ్బంది యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు భారత నౌకా దళం ప్రకటించింది! ఈ మేరకు భారత నావికా దళం శనివారం ఓ చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. దీనిలో డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ కోల్‌కతా ఉపరితల నౌక, స్కార్పీన్ క్లాస్ జలాంతర్గామి, ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ఉన్నాయి. వీటిని 'నావికా దళ త్రిశూల శక్తి'గా నావికా దళం అభివర్ణించింది. ''నావికా దళ త్రిశూల శక్తి – తరంగాలపైన, కింద, ఆవల'' అని రాసింది. ఈ పోస్ట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. ఇది ఫైల్ ఫొటో అయి ఉండవచ్చు. ఈ సందర్భంగా నావికా దళం గత వారం అరేబియా సముద్రంలో అనేక యాంటీ-షిప్ ఫైరింగ్స్ చేస్తున్న యుద్ధ నౌకల చిత్రాలను షేర్ చేసింది. సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. సముద్రం మధ్య నుంచి బ్రహ్మోస్ యాంటీ-షిప్, యాంటీ సర్ఫేస్ క్రూయిజ్ మిసైల్స్‌ను ఫైర్ చేస్తున్నట్లు ఈ పోస్ట్‌లో కనిపించింది. మన దేశ సముద్ర సంబంధిత ప్రయోజనాలను ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలా అయినా కాపాడేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది.

భారత సైన్యాధికారులపై తప్పుడు కథనాలు

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర ఆంక్షలు, ప్రతీకార చర్యలకు పాల్పడుతున్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా పని చేసే పలు మీడియా సంస్థలు, నకిలీ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా భారత సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుని నిస్సిగ్గుగా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ, వారి ప్రతిష్టను దిగజార్చడానికి విఫలయత్నం చేస్తున్నాయి. అయితే అధికారిక రికార్డులు, అధికారిక వాస్తవ తనిఖీలు ఈ వాదనలను పూర్తిగా తోసి పుచ్చడమే కాక, అవి అవాస్తవమని నిర్ధారిస్తున్నాయి. భారత డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ డీఎస్ రాణాను ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని, ఉత్తర కమాండ్‌లో భద్రతా వైఫల్యానికి కారకుడిగా పేర్కొంటూ లెఫ్టినెంట్ గవర్నర్ సుచీంద్ర కుమార్‌ను విధుల నుంచి తొలగించారని పాక్ మీడియా దుష్ప్రచారం చేసింది. పాకిస్థాన్‌తో యుద్ధానికి నిరాకరించినందుకు ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్, ఎయిర్ మార్షల్ ఎస్‌పీ ధర్‌కర్‌ను డిస్మిస్ చేశారనీ ప్రచారం చేసింది.

పహల్గాం దాడిలో ఆ మూడింటిదీ ప్రత్యక్ష పాత్ర

ఎల్ఈటీ, ఐఎస్ఐ, పాకిస్థాన్ ఆర్మీల ప్రమేయంపై ఎన్ఐఏ నివేదిక

ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడికి పాకిస్థాన్ కేంద్రంగా కుట్ర జరిగినట్టు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) నిర్ధారించింది. ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ పర్యవేక్షణలో తయారు చేసిన ప్రాథమిక దర్యాప్తు నివేదికలో ఉగ్రదాడిలో లష్కరే తాయిబా (ఎల్ఈటీ), ఐఎస్ఐ, పాకిస్థాన్ ఆర్మీల ప్రత్యక్ష పాత్ర ఉన్నట్టు స్పష్టం చేసింది. ఈ నివేదికను ఎన్ఐఏ త్వరలోనే హోం శాఖకు సమర్పించనున్నట్టు తెలిసింది. దాడి జరిపిన ఉగ్రవాదులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని వారి నిర్వాహకులతో నిత్యం సంప్రదింపులు జరిపేవారని, విజయవంతంగా వీరు సరిహద్దును దాటేందుకు జరిపిన ఆపరేషన్‌కు సంబంధించిన డిజిటల్ ఆధారాలు, ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ఈ విషయాన్ని నిర్ధారించాయన్నారు. దాడికి ముందే ఉగ్రవాదులు మారణాయుధాలను బేతాబ్ లోయలో దాచి ఉంచారని, ఈ దాడికి స్థానిక ఓవర్‌గ్రౌండ్ వర్కర్స్ (ఓడబ్ల్యూజీలు) సహకారం అందించారని తేలిందన్నారు. ఈ నివేదిక హోం శాఖకు చేరిన తర్వాత ఉగ్రవాదులకు సహకారం అందించే స్థానిక నెట్‌వర్క్‌లపై, సరిహద్దు దాటడానికి సహకరించే శక్తులపై తీవ్ర చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

ఉగ్రవాదులను వదలం

వారిపై తిరుగులేని చర్య తప్పదు: మోదీ

న్యూఢిల్లీ, శ్రీనగర్, మే 3: ఉగ్రవాదుల పని పట్టకుండా ఊరుకోమని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు, దాడి వెనుక ఉన్న వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో వదలమని, వారిపై దృఢమైన, తిరుగులేని చర్య తప్పదని మోదీ శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఢిల్లీలో అంగోలా అధ్యక్షుడు జోఓ లారెన్కోతో సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. మానవ జాతికి ఉగ్రవాదం తీవ్రమైన ముప్పు అన్న విషయంలో ఇరు దేశాల నేతలం ఏకాభిప్రాయంతో ఉన్నామని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తమకు మద్దతు ఇవ్వడం పట్ల, మృతులకు సంతాపం తెలపడం పట్ల ఆయన కాంగో అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నెల 9న రష్యాలో జరిగే ఆ దేశ విక్టరీ డే వేడుకలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హాజరు కాకపోవచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

పాపాల కుండ నిండిపోయింది : ఫరూఖ్ అబ్దుల్లా

పాపాల కుండ నిండిపోయిందని, ఉగ్రవాదం తక్షణం అంతమవ్వాలని జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా చెప్పారు. గత నెల 22న పహల్గాంలో జరిగిన నరమేధం వెనుక ఉన్నవారు నరకంలో కుళ్లిపోతారన్నారు. ఈ దాడిలో మరణించిన అదిల్ షా కుటుంబ సభ్యులను ఫరూఖ్ శనివారం పరామర్శించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలు వృథా కాబోవని చెప్పారు. దీనికి ప్రతీకారం తప్పకుండా ఉంటుందన్నారు. ఇదిలావుండగా, జమ్ము కశ్మీర్ ప్రస్తుత సీఎం ఒమర్ అబ్దుల్లా శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. పహల్గాం ఉగ్రదాడితోపాటు ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశం మోదీ నివాసంలో 30 నిమిషాలపాటు జరిగింది. పహల్గాం దాడి తర్వాత వీరిద్దరూ తొలిసారి కలిశారు.

'సింధూ'పై ఏవైనా నిర్మిస్తే ధ్వంసం చేస్తాం

పాక్ రక్షణ మంత్రి హెచ్చరిక

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత ఏ క్షణంలోనైనా భారత్‌తో యుద్ధం ప్రారంభమయ్యే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా మహ్మద్ ఆసిఫ్ శుక్రవారం భారత్‌ను మరోసారి బెదిరించారు. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత్ ఆ నదిపై నిర్మించే ఎలాంటి కట్టడాన్నైనా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'సింధూ నదిపై ఎలాంటి నిర్మాణం జరిగినా దాన్ని భారత దూకుడు చర్యగానే చూస్తాం'అని అన్నారు.

సరిహద్దుల్లో పాక్ రేంజర్ అరెస్ట్

అక్రమ చొరబాటుకు యత్నం

న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఓ పాకిస్థాన్ రేంజర్ భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు విఫలయత్నం చేశాడు. అయితే అప్రమత్తంగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అతనిని అదుపులోకి తీసుకుంది. నియంత్రణ రేఖ వెంబడి రాజస్థాన్‌లోని శ్రీ గంగా నగర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. అతనిని బీఎస్ఎఫ్, నిఘా అధికారులు ప్రశ్నిస్తున్నారు. చొరబడటానికి కారణాలేమిటో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత సైన్యం కదలికలు, వ్యూహాలను తెలుసుకునేందుకు వచ్చాడా? అనే విషయాన్ని ఆరా తీస్తున్నారు.

పాక్ సైన్యంపై బలూచ్ మెరుపు దాడి

22 మంది సైనికులు మృతి

ఇస్లామాబాద్, మే 3: ఒక పక్క భారత్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ పాకిస్థాన్‌కు స్వదేశంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా, పాకిస్థాన్, బలూచిస్థాన్ మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. పాకిస్థాన్ ఆర్మీపై బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ మెరుపు దాడి చేసింది. ఈ దాడిలో 22 మంది పాక్ సైనికులు, ఆరుగురు లిబరేషన్ ఆర్మీకి చెందిన వారు మృతి చెందారు. పాకిస్థాన్‌లోని కొన్ని పట్టణాలలో లిబరేషన్ ఆర్మీ పాగా వేసినట్టు సమాచారం. కాగా, బలూచిస్థాన్ పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రావిన్స్. అయితే జనాభా పరంగా అతి తక్కువ మంది ఉన్న ప్రావిన్స్. ఇక్కడ ఎడారి ప్రాంతం ఎక్కువ. అక్కడి ప్రజలు బలూచ్ జాతీయులు.

అరేబియాలో నేవీ ఫైరింగ్ డ్రిల్స్

ప్రధానితో నేవీ చీఫ్ భేటీ

న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలో శనివారం భారతీయ నౌకాదళం ప్రారంభించిన లైవ్ ఫైరింగ్ డ్రిల్స్ (సన్నాహక కాల్పుల కసరత్తు) ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగనున్నది. ఈ డ్రిల్స్‌లో నౌకాదళ సిబ్బంది వాస్తవిక యుద్ధ రంగంలో ఉపయోగించే మందుగుండునే ఉపయోగిస్తారు. యుద్ధ సన్నద్ధతను, ఆయుధాల సామర్థ్యాన్ని పరిశీలించే నిమిత్తం ఇలాంటి డ్రిల్స్ జరుగుతాయి. శనివారం ఉదయం నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి ప్రధాని నరేంద్ర మోదీతో గంటసేపు సమావేశమై తమ నిర్వహణ సంసిద్ధతను, అరేబియా సముద్రంలో జరుగుతున్న నేవీ సిబ్బంది లైవ్ ఫైరిగ్ డ్రిల్స్ గురించి వివరించారు.

పాక్ ఒక విఫల దేశం

ఎంఐఎం చీఫ్ ఒవైసీ

హైదరాబాద్: పాకిస్థాన్‌పై హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఒక విఫల దేశమని, అది భారత్‌ను ఎన్నడూ శాంతంగా ఉండనీయదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పాకిస్థాన్ దేశాన్ని గ్రే లిస్టులో చేర్చేలా ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్సు (ఎఫ్‌టీఏఎఫ్) చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ లాంటి పొరుగు దేశాలతో పాక్‌కు స్నేహపూర్వక సంబంధాలు లేవని అన్నారు. పాకిస్థాన్ విమానాలు, నౌకలపై నిషేధం విధించి మోదీ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు.

పాక్ యువతిని పెండ్లాడిన జవాన్ డిస్మిస్

శ్రీనగర్ : పాకిస్థాన్ యువతి మినాల్ ఖాన్‌ను పెండ్లి చేసుకున్న జవాన్ మునీర్ అహ్మద్‌ను డిస్మిస్ చేసినట్లు సీఆర్‌పీఎఫ్ శనివారం ప్రకటించింది. 41వ బెటాలియన్‌లో పని చేస్తున్న మునీర్ తాను పాక్ జాతీయురాలిని పెండ్లి చేసుకున్న విషయాన్ని రహస్యంగా ఉంచడంతోపాటు, ఆమె వీసా గడువు ముగిసినప్పటికీ, ఆ విషయం తెలిసి కూడా ఆమెకు చట్టవిరుద్ధంగా భారత దేశంలో ఆశ్రయం ఇచ్చాడని తెలిపింది. ఆయన సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించారని, జాతీయ భద్రతకు హానికరమని పేర్కొంది. పాక్‌లోని మినాల్‌ను కశ్మీరులోని మునీర్ వాట్సాప్ వీడియో కాల్ ద్వారా 2024 మే నెలలో పెండ్లి చేసుకున్నట్లు తెలుస్తున్నది.

అది భయంకర కోర్టు ధిక్కరణ చర్య

నకిలీ కోర్టు ఉత్తర్వులపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: నకిలీ కోర్టు ఉత్తర్వులను సృష్టించడాన్ని అత్యంత భయంకరమైన కోర్టు ధిక్కరణ చర్యగా సుప్రీం కోర్టు అభివర్ణించింది. తాము జారీ చేసిన ఉత్తర్వులు పక్కదారి పట్టకుండా పరిరక్షించుకోవలసిన బాధ్యత న్యాయస్థానాలకు ఏర్పడిందని జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. కోర్టులకు చెందిన ఉత్తర్వులు నకిలీవి సృష్టించడం అత్యంత భయంకరమైన కోర్టు ధిక్కరణ చర్యగా ధర్మాసనం వర్ణించింది. న్యాయవ్యవస్థ పరిపాలనా యంత్రాంగాన్ని దెబ్బ తీయడంగా, రికార్డులను ఫోర్జరీ చేయడంగా పరిగణించాలని ధర్మాసనం తెలిపింది.

కీవ్ భద్రతకు హామీ ఇచ్చేవారుండరు

■ మెద్వెదెవ్ హెచ్చరిక

మాస్కో: మాస్కోపై ఉక్రెయిన్ దాడి చేస్తే, కీవ్ భద్రతకు హామీ ఇచ్చేవారు ఎవరూ ఉండరని రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదెవ్ శనివారం హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సోవియెట్ యూనియన్ విజయాన్ని గుర్తు చేసుకుంటూ ఈ నెల 9న మాస్కోలో 80వ వార్షిక విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా మాస్కోపై ఉక్రెయిన్ దాడి చేస్తే, ఆ మర్నాడు మే 10వ తేదీని చూడటానికి ఆ దేశ రాజధాని కీవ్ ఉంటుందనే హామీని ఎవరూ ఇవ్వలేరని మెద్వెదెవ్ చెప్పారు. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ పూర్తి స్థాయి కాల్పుల విరమణకు తాము సిద్ధమని తెలిపారు.

170 డ్రోన్ల కూల్చివేత

క్రిమియా, ఉక్రెయిన్ సరిహద్దుల్లో శుక్ర-శనివారాల మధ్య రాత్రి 10కి పైగా మిసైళ్లను, 170 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా శనివారం ప్రకటించింది. మరోవైపు ఖర్కీవ్‌పై రష్యా డ్రోన్ దాడిలో 47 మంది గాయపడినట్లు రీజనల్ గవర్నర్ ఓలెహ్ తెలిపారు. 12 చోట్ల ఈ దాడులు జరిగాయని చెప్పారు.

పాక్ క్షిపణి పరీక్ష సక్సెస్!

ఇస్లామాబాద్, మే 3: పాకిస్థాన్ శనివారం అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణి శిక్షణ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపింది. ఎక్స్ ఇండస్ కసరత్తుల్లో భాగంగా తయారు చేసిన 450 కి.మీ పరిధి గల ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి ఇది. దళాల కార్యాచరణ సంసిద్ధతను నిర్ధారించడం, క్షిపణి అధునాతన నావిగేషన్ వ్యవస్థ, మెరుగైన యుక్తి లక్షణాలతో సహా కీలకమైన సాంకేతిక పారామితులను ధ్రువీకరించడం ఈ ప్రయోగం లక్ష్యం అని తెలిపింది. ఈ క్షిపణి శిక్షణ ప్రయోగాన్ని ఆర్మీ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ కమాండర్‌తో పాటు స్ట్రాటజిక్ ప్లాన్స్ డివిజన్ సీనియర్ అధికారులు, శాస్త్రవేత్తలుతిలకించినట్టు పీటీవీ సహా పలు వార్తా సంస్థలు తెలిపాయి.

సంపన్నుల్లోనే అధికంగా దాన కర్ణులు

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 3: సామాజికంగా, ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉన్నవారితో పోలిస్తే అధిక ఆదాయం, ఆర్థికంగా పైస్థాయిలో ఉన్నవారిలోనే సామాజిక బాధ్యత అధికంగా ఉంటుందని ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. పీఎన్ఏఎస్ నెక్సస్ ప్రచురించిన సమగ్ర ప్రపంచ అధ్యయనంలో సంపదకు, దాతృత్వానికి మధ్య ఉన్న బంధం వెల్లడైంది. బర్మింగ్‌హాం యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు 76 దేశాల వ్యాప్తంగా 80,000 మందినిపైగా ఈ అధ్యయనం కోసం ప్రశ్నించారు. ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొని, వాటిని అధిగమించి సంపన్నులుగా ఎదిగిన వ్యక్తులు విరాళాలు ఇవ్వడం, స్వచ్ఛంద సేవ చేయడం, ఇతరులకు సాయపడడం వంటి దాతృత్వ, సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. డబ్బు సంపాదన పెరిగే కొద్దీ సామాజిక బాధ్యత తగ్గిపోతుందన్న భావన చాలా మందిలో ఉందని, అయితే ఇది కేవలం అపోహ మాత్రమేనని బర్మింగ్‌హాం యూనివర్సిటీకి చెందిన న్యూరోసైన్స్ ప్రొఫెసర్, అధ్యయన సహ రచయిత పాట్రీషియా లాక్‌వుడ్ తెలిపారు. దాతృత్వ కార్యక్రమాల కోసం అధికంగా విరాళాలు ఇచ్చే వ్యక్తులు సంపన్నులలోనే అధికంగా ఉన్నారని, ఈ సుగుణం అనేక దేశాలలో కనిపించిందని ఆయన చెప్పారు.

పెండ్లి వేడుకకు బెయిల్‌పై నిందితుడు విదేశాలకా?

పిటిషన్‌ను తిరస్కరించిన అలహాబాద్ హైకోర్టు

లక్నో: వివాహ వేడుక లేదా విహారం నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరే హక్కు బెయిల్ మీద ఉన్న నిందితుడికి ఉండదని అలహాబాద్ హైకోర్టు తేల్చి చెప్పింది. ఉత్తరప్రదేశ్ బరేలీలోని కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఆదిత్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిందితుడు విదేశీ ప్రయాణానికి బంధువుల వివాహం లేదా విదేశాల్లో విహారం ముఖ్యమైన కారణాలుగా పరిగణించలేమని హైకోర్టు ధర్మాసనం పేర్కొన్నది. బంధువుల పెండ్లికి వెళ్లేందుకు అమెరికా, ఫ్రాన్స్ వెళ్లేందుకు తనకు అనుమతి ఇవ్వాలంటూ ఆదిత్యమూర్తి కోర్టును కోరగా, అందుకు న్యాయస్థానం తిరస్కరించింది. అత్యవసర అధికారిక పనులు, వైద్య చికిత్స నిమిత్తం మాత్రమే విదేశీ ప్రయాణానికి అర్హుడవుతాడని స్పష్టం చేసింది.

నేడు నీట్ యూజీ

■ ఒక తప్పు సమాధానానికి ఒక మార్కు కోల్పోయినట్టే

■ కాపీయింగ్ అరికట్టేందుకు ఏఐ వినియోగం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ), న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీ పరీక్ష ఆదివారం జరగనున్నది. దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్ష సందర్భంగా సెంటర్ల గేట్లను 30 నిమిషాల ముందే క్లోజ్ చేస్తారు. తెలంగాణలో 190 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 72,507 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. కాపీయింగ్‌ను అరికట్టేందుకు అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బేస్డ్ రియల్ టైమ్ అనలెటికల్ టూల్స్, టెక్నాలజీని వాడుతున్నట్టు ఎన్టీఏ తెలిపింది. తప్పుగా సమాధానం రాస్తే ఒక్కో ప్రశ్నకు ఒక్కో మైనస్‌మార్కు కోల్పోవాల్సి ఉంటుంది.

పరీక్షా కేంద్రాలలో మాక్ డ్రిల్స్

నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు శనివారం అన్ని పరీక్షా కేంద్రాలలో మాక్ డ్రిల్స్ నిర్వహించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 500 నగరాల్లో ఏర్పాటు చేసిన5,453 పరీక్షా కేంద్రాలలో ఆదివారం నీట్-యూజీ పరీక్ష జరగనున్నది. ఈ ఏడాది 22.7 లక్షల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

14 మంది విద్యార్థుల అడ్మిషన్లు రద్దు

నీట్-యూజీ 2024 పరీక్షలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో 26 మంది విద్యార్థుల ఎంబీబీఎస్ విద్యార్థులను తక్షణమే సస్పెండ్ చేసినట్లు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) శనివారం ప్రకటించింది. మరో 14 మంది విద్యార్థుల అడ్మిషన్లు రద్దు చేసినట్లు ఎన్ఎంసీ ప్రకటించింది.

గోవా గుడిలో తొక్కిసలాట

ఏడుగురి మృతి.. 80 మందికి గాయాలు

పనాజీ, మే 3: గోవాలో ఘోర విషాద ఘటన సంభవించింది. షిర్గావ్ గ్రామంలోని శ్రీ లైరాయి దేవి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా మరో 80 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆలయంలో ఏటా జరిగే జాతర సందర్భంగా ఈ తొక్కిసలాట జరిగింది. జాతరలో పాల్గొనేందుకు గోవా చుట్టు పక్కల రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భారీ సంఖ్యలో భక్తుల రాక, రద్దీని నియంత్రించేందుకు తగిన బందోబస్తు చేయకపోవడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక వార్తలు తెలియచేశాయి.

ఆస్ట్రేలియా ఎన్నికల్లో లేబర్ పార్టీ గెలుపు!

రెండోసారి ప్రధానిగా అల్బనీస్!

సిడ్నీ, మే 3: ఆస్ట్రేలియా సాధారణ ఎన్నికలలో శనివారం వామపక్ష సానుకూలవాదిగా పేరు పొందిన ప్రధాని ఆంథనీ అల్బనీస్ గెలుపొందారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న వేళ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన ప్రకటించారు. ప్రపంచంలోనే ఉత్తమ దేశమైన ఆస్ట్రేలియాకు సేవ చేసేందుకు మరోసారి అవకాశం ఇచ్చినందుకు లేబర్ పార్టీ నాయకుడైన అల్బనీస్ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతున్నప్పటికీ ప్రాథమిక ఫలితాల సరళి లేబర్ పార్టీకే అధికారం దక్కే అవకాశాలను సూచిస్తోంది.

కొండల్లో నడుస్తుంటే కోట్ల నిధి లభ్యం

న్యూఢిల్లీ: ఇద్దరు వ్యక్తులు(హైకర్స్) సరదాగా చేపట్టిన విహార